# యూజీసీ మార్గదర్శకాలపై నివేదిక

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ) : ఫ్యాకల్టీ, వీసీల నియామకం, పదోన్నతులపై యూజీసీ జారీచేసిన డ్రాఫ్ట్ మార్గదర్శకాలు -నష్టంపై తెలంగాణ ఉన్నత విద్యామండలి సర్కారుకు నివేదిక అందజేసింది. దీనిపై నిపుణుల బృందంతో అధ్యయనం చేయించిన మండలి, వారు సమర్పించిన నివేదికను విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణాకు అందజేసింది.

# కొనసాగుతున్న ఫ్యాకల్టీ ర్యాటిఫికేషన్

కూకట్‌పల్లి: జేఎన్‌టీయూహెచ్ ప్రవేశాల విభాగంలో ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలు పొందిన ఫ్యాకల్టీ ర్యాటిఫికేషన్(ధ్రువీకరణ) కొనసాగుతుంది. రెండు వారాల క్రితం మొదలైన ఈ ప్రక్రియలో మంగళవారం సీఎస్ఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల ధ్రువీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారి సర్టిఫికెట్లు, అర్హతలు పరిశీలించారు. ఫిబ్రవరి 4వరకు కొనసాగుతుందని అధికారులు వివరించారు.

# 3 రాష్ట్రాల్లోనే ఆచార్యుల రిటైర్మెంట్ వయసు 60

- 10 చోట్ల 65... 9 చోట్ల 62
- ప్రభుత్వానికి నివేదిక అందజేసిన ఉన్నతాధికారులు

ఈనాడు, హైదరాబాద్: దేశంలోని పలు రాష్ట్రాల్లో ఆచార్యుల పదవీ విరమణ వయసుపై ఉన్నతాధికారులు ఇటీవల ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి గత డిసెంబరులో ఆచార్యుల పదవీ విరమణ వయసును 65కు పెంచాలని ప్రభుత్వానికి ప్రతిపాదన పంపిన విషయం తెలిసిందే. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి సైతం పెంచే ఆలోచన చేస్తున్నామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో దేశంలోని 22 ప్రధాన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుల పదవీ విరమణ వయసును పరిశీలించగా కేవలం తెలంగాణ, తమిళనాడు, పంజాబ్‌లలో మాత్రమే 60 సంవత్సరాలకు ఆచార్యులు పదవీ విరమణ పొందుతున్నారని నివేదికలో ఉన్నతాధికారులు వివరించారు. తొమ్మిది చోట్ల 62, పది చోట్ల 65గా ఉందని పేర్కొన్నారు. మరోవైపు ఆచార్యులు యూజీసీ ప్రకారం 65 చేయాలని కోరుతున్నారు. ఈనెలలో ఓయూలో ముగ్గురు పదవీ విరమణ పొందుతున్నారు.

**గత డిసెంబరు 31 నాటికి వర్సిటీల్లో ఇదీ పరిస్థితి...**

- మొత్తం మంజూరు పోస్టులు: 2,878(తాజాగా పాలమూరుకు మంజూరైన వాటితో కలుపుకొని)
- పనిచేస్తున్న వారు: 759(26.16 శాతం)
- ఖాళీలు: 2,125(73.86 శాతం)
- కాంట్రాక్టు సహాయ ఆచార్యుల సంఖ్య: 1170
- బోధనేతర పోస్టులు: 4,995. వాటిల్లో 50 శాతం ఖాళీ

పదవీ విరమణ 65గా ఉన్నవి: పశ్చిమ బెంగాల్, బిహార్, మధ్యప్రదేశ్, ఝార్ఖండ్, పుదుచ్చేరి, దిల్లీ, ఉత్తరాఖండ్, యూపీ, మహారాష్ట్ర, ఏపీ

62గా ఉన్నవి: కర్ణాటక, గుజరాత్, ఒడిశా, కేరళ, ఛత్తీస్‌గఢ్, గోవా, హరియాణా, జమ్మూ కశ్మీర్, మిజోరం